క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకాలు, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న ఫణీశ్వరరెడ్డి

పాములపాడు: రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, సెరికల్చర్ అధికారి ప్రసాదరావులు అన్నారు. మంగళవారం మండలంలోని వాడాల, యర్రగూడూరు గ్రామాల్లో వారు పొలం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. వారు రైతులతో మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు. మల్బరీ రైతులు షెడ్లు ఏర్పాటు చేసుకుంటే రాయితీ లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సాజిద్‌బాషా, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

మిడుతూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)కు వచ్చిన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అధికారులకు సూచించారు. మండల కేంద్రం మిడుతూరు, చింతలపల్లి గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాల సందర్భంగా సీసీ రహదారులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించారు.

బయలు వీరభద్రస్వామికి ప్రదోష పూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం క్షేత్ర పాలకుడైన బయలు వీరభద్ర స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని పంచామృతం, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో అభిషేకించారు.

వృత్తి విద్యపై అవగాహన అవసరం



విద్యార్థులకు సర్టిఫికెట్స్ పంపిణీ చేసిన హెచ్‌ఎం రామచంద్రమూర్తి

నందికొట్కూరు: వృత్తి విద్య కోర్సులపై విద్యార్థులకు అవగాహన అవసరమని కొణిదేల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామచంద్రమూర్తి అన్నారు. సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటర్న్ షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్‌ను హెచ్‌ఎం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ వృత్తి, విద్యతో స్వతహాగా జీవించే ధైర్యం వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవప్రకాష్, నారాయణరెడ్డి, రఫి, అహ్మద్, సిల్వియా, రేచల్, ఫిజికల్ డైరెక్టర్ రవికుమార్, ప్రాధమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ వద్ద బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలి



ఆర్టీసీ సీఐకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు: పేద విద్యార్థులు సౌకర్యార్థం జగనన్న కాలనీ వద్ద బస్‌స్టాప్‌ను ఏర్పాటు చేయాలని సీపీఐ, రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్టీసీ డిపో సీఐ సరోజమ్మకు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలకు వేళ్లేందుకురిక్వెస్ట్ బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు స్వామన్న, స్వాములు, నాయుడు, షేక్షావలి, మాబాష, వెంకటరమణ, హుసేన్, జనార్దన్ పాల్గొన్నారు.

మహానందీశా...ఏంటీ దుస్థితి

- ఆలయంలోని చిన్నకోనేరు వద్ద నిలిచిపోయిన మురుగునీరు
- కేశఖండనశాల వద్ద అడవిని తలపిస్తున్న వైనం
- వాటర్‌ప్లాంట్ల వద్ద పిచ్చిమొక్కలు



కేశఖండనశాల వద్ద బోర్డు పడిపోగా, పక్కనే పెరిగిన పిచ్చిమొక్కలు



వాటర్‌ప్లాంట్ వద్ద పరిస్థితి ఇలా

మహానంది: ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మహానంది అంటే మహానందానికి నిలయం. నల్లమలలో వెలసిన మహానంది అందాలు చూసిన భక్తులు మంత్రముగ్ధులవుతుంటారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి నిత్యం వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి వస్తారు. నంద్యాల జిల్లాలో జ్యోతిర్లింగ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం ఆలయం తర్వాత మహానంది ప్రసిద్ధ శైవక్షేత్రం అనేది అందరికీ తెలిసిందే. దీంతో పాటు ఏడాదికి రూ.17 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. కానీ మహానంది ఆలయ పరిసరాలు మాత్రం అపరిశుభ్రంగా మారుతుండడంతో ఆలయ పవిత్రత దెబ్బతింటుందని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయం చుట్టూ పిచ్చిమొక్కలు

మహానందీశ్వరస్వామి ఆలయం పరిసరాల్లోనే పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. అసలే కొండప్రాంతం, ఇక పరిసరాలు ఇలా ఉంటే పాముల సంచారం ఇంకా ఎక్కువగా ఉంటుందని భక్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. మహానందిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ కోసం ఏటా 65 మందిని టెండర్ల ద్వారా తీసుకుంటున్నారు. వారికి నెలకు ఒక్కొక్కరికి సుమారు రూ. 13వేలు దేవస్థానం చెల్లిస్తుంది. 65 మందిలో ప్రత్యేకంగా పారిశుద్ధ్య పనుల కోసం కొంత మందిని కేటాయించినా కనీసం ఆలయ పరిసరాల్లోని పిచ్చిమొక్కలను తొలగించే బాధ్యత లేకుండా వ్యవహరించడం బాధాకరం. కొందరు వచ్చామా, వెళ్లామా అన్నట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయంలోని ఎడమవైపున ఉన్న కల్యాణకట్ట(కేశఖండనశాల)కు వెళ్లే మార్గంలో పిచ్చిమొక్కలు, రాళ్ల గుట్టలు పడి ఉండడంతో అటుగా వెళ్లే భక్తులు అవస్థలు పడుతున్నారు. పెద్ద బోర్డు కిందపడి పగిలిపోయినా నూతనంగా బోర్డును ఏర్పాటు చేయించకపోవడం విశేషం. దీంతో పాటు ఎడమవైపున ఉన్న మహిళలు పుణ్యస్నానాలు ఆచరించే కోనేరు పక్కన నీళ్ల నిల్వ ఉండడంతో పాచిపట్టి దుర్గంధం వెదజల్లుతోంది. ఆలయం నుంచి బయటకి వచ్చాక నవవినాయకుల వెనుక ఉన్న వాటర్‌ప్లాంట్ చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడంతో మంచినీళ్ల కోసం వచ్చే వారు ఆవేదన చెందుతున్నారు. ఇలా ఒకటి, రెండు చోట్ల కాదు ఆలయం చుట్టూ అపరిశుభ్రత తాండవిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. పరిసరాల అపరిశుభ్రతపై ఏఈఓ ఎరమల మధు దృష్టికి తీసుకెళ్లగా పనులు చేయిస్తామన్నారు.



చిన్నకోనేరు పక్కన నిలిచిన నీరు, పాచిపట్టిన వైనం

బంకులు తొలగించాల్సిందే

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని రింగ్‌పార్క్ సెంటర్ పరిధిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న బంకులను వెంటనే తొలగించాలని సీఐ చంద్రబాబు ఆదేశించారు. ఇటీవల కొందరు వ్యక్తులు ప్రధాన రోడ్లకు ఇరువైపులా అనధికారికంగా బంకులు ఏర్పాటు చేస్తూ ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నారని జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన తహసీల్దార్ శ్రీనివాసులు బంకులు తొలగించాల్సిందిగా సీఐ చంద్రబాబును ఆదేశించారు. దీంతో మంగళవారం బంకులు ఏర్పాటు చేసుకుంటున్న వారిని తొలగించాలని సీఐ హెచ్చరించారు.

జన్యుపరమైన వ్యాధి డిస్లెక్సియా

పాములపాడు: జన్యుపరమైన వ్యాధి డిస్లెక్సియా అని ఉపాధ్యాయుడు దాయరేకుల రవి అన్నారు. మంగళవారం స్థానిక ఏఎస్‌ఆర్ జెడ్పీహై స్కూలు నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర సాంకేతిక విద్య సీఐఈటీ ఢిల్లీ ఆధ్వర్యంలో డిస్లెక్సియా ఆన్‌లైన్ అవగాహన కార్యక్రమం ఈ నెల 18వ తేదీ వరకు నిర్వహించబడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బనాయక్, రవీంద్రనాయుడు, విజయ్‌బాబు, షంసుద్దీన్, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జీవితం ఎందరికో ఆదర్శం

ఆత్మకూరు: దేశ కీర్తి ప్రతిష్టలను ఖండాంతరాలకు వ్యాపింపజేసిన మిసైల్ మ్యాన్, మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్‌కలాం అందరికీ ఆదర్శనీయుడని ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్ అన్నారు. మంగళవారం ఆత్మకూరులో కలాం స్మారక సమిదా కన్వీనర్ జవహర్‌నాయక్ అధ్యక్షతన అబ్దుల్‌కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం బాలలకు స్ఫూర్తిగా, యువతకు చైతన్యదీప్తిగా, శాస్త్రవేత్తలకు మిసైల్ మ్యాన్‌గా, నేతలకు ఆదర్శంగా నిలిచారన్నారు. కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఎదగాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఏటా కలాం జయంతిని అంతర్జాతీయ విద్యార్థి దినోత్సవంగా జరుపుకోవడం హర్షించ దగ్గ విషయమన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పేద విద్యార్థిని అమృతకు రూ.20 వేలు అందజేశారు. పారిశుద్ధ్య కార్మికులు, చెంచు మహిళలకు డీఎస్పీ చేతులమీదుగా చీరలు పంపిణీ చేశారు. వివిధ రంగాల్లో సామాజిక సేవ చేసిన వెంకటసుబ్బయ్య ఆచారి, రాంప్రసాద్, సలాంబాషా, రుక్మిణి, హెచ్‌ఎం మక్బుల్‌బాషా, అల్తాఫ్‌హుసేన్, ప్రభాకర్‌లను ఘనంగా సన్మానించారు. అలాగే ఆత్మకూరులోని కృషి పండ్ల తోటల రైతు సేవా సొసైటీ కార్యాలయంలో కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మోమిన్‌మునీర్‌బాషా, కృషి పండ్ల తోటల సంఘం అధ్యక్షుడు బైరాపురం మహబూబ్‌బాషా, రైతులు ముర్తుజా బైగ్, టైగర్ బాబు, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సామాజికవేత్తను సన్మానిస్తున్న డీఎస్పీ రామంజినాయక్



నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

పగిద్యాల: ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఎం లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో పార్టీ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన దాన్యానికి ప్రభుత్వం కనీసమద్దతు ధర ప్రకటించాలన్నారు. కౌలురైతులకు గుర్తింపుకార్డుల తోపాటు బ్యాంకు రుణాలు ఇప్పించాలని కోరారు. ఉచిత ఇసుకను వెంటనే అమలు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.నాగేశ్వరరావు, పక్కీర్‌సాహెబ్, త్యాగరాజు, హుసేనమ్మ, తిక్కస్వామి, మధులత, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌కుమార్

వడ్డేమాన్ గ్రామంలో 'పల్లె పండుగ'

నందికొట్కూరు: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వడ్డేమాన్ గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. సర్పంచ్ రామచంద్రుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: జూటూరు గ్రామానికి నాలుగు అంగర్గత రహదారులకు సీసీ రోడ్లు మంజూరయ్యాయని సర్పంచ్ నాయిని సావిత్రమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని జూటూరులో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, జేఈ రాఘవేంద్రప్రసాద్, ఏపీఓ విమలమ్మ, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పగిద్యాల: మండలంలోని బీరవోలు గ్రామంలో మంగళవారం అధికారులు పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. అభివృద్ధి పనులకు భూమి పూజచేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఈఓపీఆర్డీ నాగేంద్రయ్య, కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో సర్పంచ్ మశమ్మ ఆధ్వర్యంలో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శి చాందిని, వెలుగు ఏపీఎం రమణ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ కళ్యాణ్‌కుమార్, టీడీపీ నాయకులు పోత సహదేవుడు, జానకీరాముడు, నారాయణ, సత్యరాజు, యేసేపు,తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల గ్రామంలో రూ.41లక్షలతో ఏడు సిమెంటు రోడ్ల నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేసినట్లు ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ బషీర్, ఏపీఓ గౌరీబాయి, సర్పంచ్ బాలమద్దిలేటి, వెంకటేశ్వర్లుయాదవ్, రాముడు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



భూమిపూజ చేస్తున్న దృశ్యం

అభివృద్ధి పనులకు భూమి పూజ

బండిఆత్మకూరు: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మండలంలో పర్యటించారు. నారాయణపురం, లింగాపురం, ఈర్నపాడు, బి.కోడూరు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

సీసీ రోడ్డుకు....

వెలుగుడు: మండలంలోని రేగడ గూడూరులో రూ. 9.7 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి మంగళవారం భూమి పూజ చేశారు. గ్రామంలో మౌలిక వసతులను గుర్తించి నివేదికలు తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. మాజీ ఎంపీపీ రామసుబ్బారెడ్డి, వంగాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

16లోపు సరిచేసుకోండి

కొత్తపల్లి: పంట నమోదుకు సంబంధించి ఏవైనా తప్పులు ఉంటే ఈనెల 16వ తేదీలోపు సరిచేసుకోవాలని జిల్లా వనరుల వ్యవసాయ కేంద్రం అధికారి హేమలత అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆమె రైతులతో సమావేశమయ్యారు. అదేవిధంగా గ్రామ శివారుల్లోని పంటపొలాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024 ఖరీఫ్ సీజన్‌లో పంటనమోదు చేసుకున్న రైతుల వివరాలు ఆయా గ్రామాల రైతుసేవా కేంద్రాల వద్ద సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శిస్తున్నారన్నారు. అదేవిధంగా రానున్న మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉన్నందుకు రైతులు పంటకోతలు వాయిదా వేసుకోవాలన్నారు. అలాగే కళ్లాలో ఆరబోసిన దాన్యాన్ని సరక్షితమైన ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.మహేష్, ఉద్యాన శాఖాధికారి చందన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి లింగమూర్తి, పకృతి వ్యవసాయ సిబ్బంది బాషా, రైతుసేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హేమలత

పేకాట రాయుళ్ల అరెస్ట్

మహానంది: మండల పరిధిలోని సీతారామపురంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు మంగళవారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన జయభరత్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, శివ, రాములను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మరో ఇద్దరు పరారైనట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ. 12 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డిగ్రీ కళాశాలకు రెండు కోర్సులు మంజూరు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీఎస్సీ కెమిస్ట్రీ ఫోర్ ఇయర్ హానర్స్, బీకామ్ కంప్యూటర్స్ ఫోర్ ఇయర్ హానర్స్ కోర్సులు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ వై.జిష్ణునాగ్ విజయ్ తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రీ హానర్స్ కోర్సులో చేరేందుకు 2024లో బీఎస్సీ, బీజెడ్సీ లేదా ఎంపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. బీకామ్ కంప్యూటర్స్ హానర్స్ (4వ సంవత్సరం) చేరేందుకు 2024లో బీకామ్ కంప్యూటర్స్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని చెప్పారు. మరిన్ని వివరాలకు 7801025096, 9908725069 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించండి

మహానంది: సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని అన్నారు. తిమ్మాపురంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు కేవీఆర్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. పలు గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడం వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని.. వాటిని తొలగించాలని కోరారు. ఎంపీడీఓ మహబూబ్ దౌలా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుడులు, బడుల సమీపంలో మద్యం షాపులు నిర్వహిస్తే సహించం

జూపాడుబంగ్లా: నూతన మద్యం దుకాణాలను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గుడులు, బడులకు సమీపంలో నిర్వహిస్తే ఉపేక్షించేదిలేదని సీపీఎం నాయకుడు రమేష్‌బాబు హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎక్సైజ్‌శాఖ అధికారులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి మద్యం దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేయాలన్నారు. అలాకాకుండా రాజకీయ ఒత్తిడిలకు తలొగ్గి నివాసగృహాల మధ్యన, పాఠశాలలు, దేవాలయాలకు సమీపంలో మద్యం దుకాణాల నిర్వహణకు అనుమతులిస్తే ప్రజలను కూడగట్టుకొని ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

సమస్యలు లేకుండా చూడాలి

కొత్తపల్లి: గ్రామాలలో రెవెన్యూ శాఖ పరిధిలో ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం గ్రామరెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాలలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ బూత్‌ల ఏర్పాటు

- డీఎస్పీ రామాంజి నాయక్

శ్రీశైలం: శ్రీశైల మహా క్షేత్రంలో రానున్న కార్తీక మాస భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ బూత్ (ట్రాఫిక్ ఐలాండ్)లను ఏర్పాటు చేస్తున్నామని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ తెలిపారు. మంగళవారం శ్రీశైలం వన్‌టౌన్ సీఐ ప్రసాద్ రావుతో కలిసి రద్దీ కూడళ్లను పరిశీలించారు. నంది జంక్షన్, నంది సర్కిల్, మల్లికార్జున సదన్ జంక్షన్, అన్నదాన సత్రం సర్కిల్, పుష్కరిణి జంక్షన్, ఆసరా హోటల్ సర్కిల్, దేవస్థానం హాస్పిటల్ రోడ్డు చౌరస్తా తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఆయా సర్కిళ్ల వద్ద ఏర్పాటు చేసేందుకు వెంకటేశ్వరరావు రూ.4లక్షల విలువైన ట్రాఫిక్ బూత్‌లను విరాళంగా అందజేశారని తెలిపారు. వాటిని కొన్ని ప్రధాన జంక్షన్‌లలో ఏర్పాటు చేసి లాంఛనంగా డీఎస్పీ ప్రారంభించారు.



పాతాళగంగకు వెళ్లే జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ బూత్ వద్ద డీఎస్పీ, సీఐలు

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



బన్నూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ

జూపాడుబంగ్లా: రైతులు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం తగ్గించుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని 80బన్నూరు గ్రామంలో ×పొలం పిలుస్తుంది? కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో అధికదిగుబడులు సాధించాలని సూచించారు. రబీసీజన్‌కు అవసరమైన శనగవిత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో రాయితీపై అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రైతులు పొగాకు, కందిపంటల సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు.

తప్పుల సవరణకు చివరి అవకాశం

వెలుగోడు: రైతులు సాగుచేసిన పంట వివరాలను రైతు సేవా కేంద్రంలో ముసాయిదా జాబితా ప్రదర్శించామని.. ఈ-పంటలో ఏవైనా తప్పులు, సవరణలు చేసుకోవడానికి ఇది చివరి అవకాశం అని ఏఓ పవన్ కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అబ్దుల్లాపురం, గుంతకందాల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అల్పపీడన ప్రభావంతో మండలంలో వచ్చే రెండు రోజులు భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మొక్కజొన్న పంట కోత దశలో ఉందని..ఈ సమయంలో పంట కోతను వర్షాలు తగ్గేంత వరకు వాయిదా వేసుకోవాలన్నారు. ఒకవేళ కోత జరిగి ఉంటే వర్షానికి తడవకుండా టార్పాలిన్ పట్టలతో ఎత్తయిన ప్రదేశంలో కప్పి ఉంచాలన్నారు. పత్తి కోత దశలో ఉండడంతో వర్షానికి తడవకుండా తీసివేయాలని తెలిపారు.



రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ

జోరు వాన... కలవర పడుతున్న రైతన్న



పొగాకు పంటలో నిలిచిన వర్షపు నీరు



వర్షానికి మొక్కజొన్నలు తడవకుండా పట్టాలు కప్పుకొంటున్న రైతులు

కొత్తపల్లి: మండలంలో రెండురోజులుగా జోరువాన కురుస్తుంది. దీంతో రైతన్నలు కలవర పడుతున్నారు. మంగళవారం కూడా మండలంలో జోరుగా వర్షం కురుస్తుంది. మొక్కజొన్న పంటలను కోతకోసుకున్న రైతులు ధాన్యాన్ని ఎక్కడ ఆరబెట్టుకోవాలో, అస్సలు ఆరుతాయా లేదా అన్న సందిగ్ధంలో పడ్డారు. బాగా ఆరకపోతే గింజలు నల్లపడుతాయని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు మధ్యస్థ పంటలు వేసుకొన్న పంటల్లో వర్షపునీరు నిలిచిపోతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు.

తుపాన్ ప్రభావంతో అన్నదాతల విలవిల

జూపాడుబంగ్లా: తుపాన్ ప్రభావంతో రైతులు విలవిలలాడుతున్నారు. రెండు రోజుల నుంచి ఎడతెరపిలేకుండా తుంపర్లతో కూడిన వర్షం కురుస్తూనే ఉంది. ధాన్యం నూర్పిడి చేసుకొనేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరబెట్టిన ధాన్యం తడిసిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. రోడ్లపై ఆరబెట్టుకొన్న మొక్కజొన్న దిగుబడులను కాపాడుకునేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. టార్పిలిన్‌తో కప్పి పెట్టుకుంటున్నారు. వర్షం కురుస్తుండటంతో ధాన్యం మొలకలొచ్చే అవకాశాలున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అల్పపీడనం.. రైతుల్లో ఆందోళన

బండిఆత్మకూరు: అల్పపీడనం కారణంగా రెండు రోజుల నుంచి మండల వ్యాప్తంగా మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ముఖ్యంగా ఈర్నపాడు, కడమల కాల్వ, వెంగళరెడ్డిపేట, బి. కోడూరు, పార్నపల్లి గ్రామాల్లో వరి పంట మరో 20 నుంచి 25 రోజుల్లో కోత దశకు చేరుకుంటాయి. ఈ తరుణంలో వర్షాలు కురవడం వల్ల పంట నేలకొరిగి, గింజలు రాలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.



నేలకొరిగిన వరిపంట

మెలకువలు పాటించాలి

ఆత్మకూరు: మండలంలోని బాపనంతపురం గ్రామంలో మంగళవారం ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగులో మెలకువలు పాటించాలని ఈ సందర్భంగా ఏఓ రైతులకు సూచించారు. కార్యక్రమంలో సెరికల్చర్ ఆఫీసర్ రాజశేఖర్, బహుళ ప్రయోజన విస్తరణ అధికారులు రవిగౌడ్, శ్రీను, కౌలు రైతుసంఘం అధ్యక్షుడు తపాల అశ్రఫ్‌అలీ, కృషి విజ్ఞాన పండ్లతోట అధ్యక్షుడు మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.